
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

ఆదివారం 9 మార్చి 2025



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	ఆదివారం	సోమవారం
కర్నూలు	6: 32	5:08
నంద్యాల	6: 29	5:08



అడ్డగోలుగా పైపులైన్..!



కొణిదేల గ్రామంలో నడి రోడ్డుపై పైపులైన్ కోసం గుంత తవ్వుతున్న దృశ్యం

- ఓర్వకల్లు పరిశ్రమల కోసం నడి రోడ్డును తవ్వుతున్న వైనం
- ముచ్చుమర్రి నుంచి ఆర్అండ్‌బీ, జాతీయ రహదారి వెంట పైపులైన్ ఏర్పాటు
- భారీ వాహనాలతో ప్రజా రవాణాకు ఇబ్బందిగా పనులు

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు నీరు అందించేందుకు వేస్తున్న పైపులైన్ పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ రోడ్డుకు కుడి వైపున పైపులైన్ తీసుకెళ్లేందుకు అనుమతులు ఉండగా... కొన్ని గ్రామాల్లో నడి రోడ్డును తవ్వుతూ పైపులైన్ పనులు సాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి పైపులైన్‌లను తొలగిస్తూ పైపులైన్ వేశాక మళ్లీ వేస్తామంటూ చెప్పి వారి పని పూర్తి కాగానే గ్రామానికి మంచినీటిని అందించే పైపులైన్ పనులను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నందికొట్కూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు వద్ద పరిశ్రమల హబ్ ఏర్పాటుకు 10 వేల ఎకరాలను కేటాయించారు. ఓర్వకల్లు మండలం గుట్టపాడు పొలిమేరలో జయరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం 2,500 ఎకరాల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశ్రమలకు నీటి సౌకర్యం కోసం ముచ్చుమర్రి నుంచి పైపు లైన్ ద్వారా నీరు తీసుకెళ్లేందుకు పనులు సాగుతున్నాయి. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా జలాలను ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన పైప్‌లైన్ తీసుకువెళ్లేందుకు పనులు సంవత్సరనర్న కాలంగా కొనసాగుతున్నాయి. ఏడు అడుగుల లోతు, 1.8 మీటర్ల వెడల్పు పొడవున ఈ కాలువను తీస్తున్నారు. ఈ పైపు లైన్ మొత్తం 56 కి.మీటర్ల మేర ఏర్పాటు చేయనున్నారు. ఈ పైపు లైన్ కోసం రూ.288 కోట్లతో పనులు ప్రారంభించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి దిగువకు 300 మీటర్లలో పంపు హౌస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన పైపు లైన్ పనులు 2023 జూన్ నెల నుంచి పనులు ప్రారంభం అయ్యాయి. అయితే ఇంత వరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ వద్ద మాత్రం పనులు ప్రారంభం కాలేదు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్ పైభాగం నుంచి పైప్‌లైన్‌ను తీసుకొని ముచ్చుమర్రి ఆర్అండ్‌బీ రోడ్డుకు కుడి వైపు నుంచి ఏర్పాటు చేస్తున్నారు. ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్లు వరకు 56 కి.మీటర్ల మేర భూమి లోపల ఈ పైప్‌లైన్‌ను ఏర్పాటు ప్రక్రియ కొన్ని గ్రామాలు మినహా రోడ్డు వెంట పూర్తి చేశారు. ముచ్చుమర్రి, కొణిదేల, నాగటూరు, నందికొట్కూరు, బొల్లవరం, బ్రాహ్మణకొట్కూరు, గార్గేయపురం మీదుగా ఆర్అండ్‌బీ రోడ్డు, కేజీ రోడ్డు వెంట పైపు లైన్ ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నుంచి కేతవరం, పూడిచర్ల మీదుగా గుట్టపాడు పొలిమేరలో నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్(ఉక్కు పరిశ్రమ) వరకు ఈ పైప్ లైన్‌ను తీసుకు పోనున్నారు. అయితే ముచ్చు మర్రి, నందికొట్కూరు మినహా అన్ని గ్రామాల్లో దాదాపు పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి ముగిసాయి. అయితే గ్రామాల్లో చేపట్టిన పైపు లైన్ పనులు అంతా గందరగోళంగా జరుగుతున్నాయి. వారికి అనువుగా ఉండే విధంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసుకుంటూ వెళ్తున్నారు.

అంతా గందరగోళం

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు నీటి సౌకర్యాన్ని ఏపీఐఐసీ అధికారులు 2023 మే నెలలో పైపులైన్ పనులను ప్రారంభించారు. 56 కి.మీటర్ల మేర జరుగుతున్న ఈ పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ముచ్చుమర్రి గ్రామం మినహా అంతా పూర్తి కావస్తున్నాయి. పైప్‌లైన్ పనులు చేపడుతున్న గుత్తేదారు చేస్తున్న పనులు గందరగోళంగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బి రోడ్డుకు కుడివైపున తీసుకెళ్లేందుకు అనుమతులు ఉండగా... కొణిదేల గ్రామంలో నడిరోడ్డును తవ్వుతూ పైప్‌లైన్‌ను తీసుకెళ్తున్నారు. బీటీ రోడ్డు వేసి రెండు మూడు నెలలు కాకముందే రోడ్డును తవ్వుతూ పైపులైన్‌ను తీసుకెళ్తున్నారు. దీంతో కొత్తగా వేసిన 11 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.4.5 కోట్లు ఖర్చు చేశారు. ఖర్చు నిధులు వృధాకావడంతో పాటు, నడి రోడ్డు కింద ఉన్న పైపు లైన్ ఏ మేరకు క్వాలిటీ ఉండేదీ అనుమానమే. సుమారు అర కిలో మీటరు వరకు పైపులైన్ కోసం రోడ్డును తవ్వారు. పైపు లైన్ పైన రోడ్డు ఉంటే భవిష్యత్తులో పైపులైన్ ఎంత పటిష్ఠంగా ఉంటుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నెహ్రూనగర్, ముచ్చుమర్రి, కొణిదేల గ్రామాలకు సంబంధించిన రైతులు పండించిన పంటలను తరలించేందుకు భారీ వాహనాల రాకపోకలు ఈ రోడ్డుపైన సాగుతాయి. భారీ వాహనాల రాకపోకలతో ఆ పైపులైన్ ఏమేరకు నాణ్యంగా ఉండేదీ అర్థం కాని పరిస్థితి. ఈ గ్రామంలో సమస్య ఇలా ఉంటే 10 బొల్లవరం గ్రామంలో పైపులైన్ తీసే సమయంలో సీపీడబ్ల్యూసీ పథకం క్రింద ఏర్పాటు చేసిన మంచి నీటి పైపులైన్‌ను తొలగించారు. పైపులను ఏర్పాటు చేశాక...సీపీడబ్ల్యూసీ పథకం పైపులైన్‌ను కూడా ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అయితే గుత్తేదారు తన పైపులైన్ పనులు పూర్తి చేసుకున్నాడే తప్ప.. గ్రామంలోని తాగునీటి పైపులైన్ పనులను గాలికి వదిలేశాడని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తుతుందని, ఇలాంటి సమయంలో పైప్‌లైన్ లేకపోతే ఎలా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఎక్కడపడితే అక్కడ వారికి అనుకూలంగా పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్వేయడంతో ఆ గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గ్రామాల్లోనే ఇలా ఉంటే నందికొట్కూరు పట్టణంలో పైపులైన్‌ను ఎలా తీసుకెళ్తారన్నది అర్థంకాని పరిస్థితి. పట్టణంలోని ప్రధాన రహదారి వెంట తీసుకెళ్తారా..? లేక శివారు ప్రాంతంలో తీసుకెళ్తారా? అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఆర్అండ్‌బీ రోడ్డు పక్కలో పైప్ లైన్ తీసుకెళ్తామని చెప్పి కొణిదేల గ్రామంలో నడి రోడ్డును తవ్వుతూ పైప్‌లైన్ పనులు సాగుతున్నాయి. ఇది చూసే వారు ముక్కున వేలేసుకోవడం తప్ప పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు వాపోతున్నారు.

ఇంటర్ పరీక్షకు 461 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 53 పరీక్షా కేంద్రాల్లో శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 461 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఐఈవో సునీత మాట్లాడుతూ 12,365 మంది జనరల్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 12018 మంది విద్యార్థులు హాజరయ్యారని, అలాగే 1497 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1383 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. మొత్తం 461 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

1021 కేసులు పరిష్కరించిన న్యాయాధికారులు



లోక్ అదాలత్‌లో కేసులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి

నంద్యాల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని మూడో అదనపు జిల్లా న్యాయాధికారి, లోక్ అదాలత్ చైర్మన్ వాసు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నంద్యాలలోని జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయని చెప్పారు. ఎస్‌టీసీ కేసులు 694, సీసీ కేసులు 66, సివిల్ కేసులు 27, ఎంసీ 2, డీవీసీ 2, ఎన్ఐయాక్ట్ 16, ఎక్సైజ్ 101, ఎంవీఓపీ 39, అడ్మిషన్ కేసులు 74, ఈపీ 15 కేసులు చొప్పున మొత్తం 1021 కేసులు పరిష్కరించినట్లు వారు తెలిపారు. ఆయా కేసుల్లోని కక్షిదారులకు రూ.3.76 కోట్ల పరిహారం అందించామన్నారు. చిన్న చిన్న సమస్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా లోక్‌అదాలత్‌కు వెళ్తే సమయం, డబ్బు ఆదా అవుతుందని సూచించారు. క్షమాపణతో ఎంత పెద్ద గొడవైనా సద్దుమణుగుతుందన్నారు. రాజీ కాగల కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీసులు ఎంతో కృషిచేస్తున్నారన్నారు. కుటుంబ కలహాల వల్ల భార్యాభర్తలు కోర్టును ఆశ్రయిస్తే పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని, రాజీయే రాజమార్గమని కక్షిదారులు తెలుసుకోవాలని న్యాయాధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ జగన్మోహన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, పీపీ శ్రీనివాసులు, రావినూతల దుర్గాప్రసాద్, విజయశేఖర్‌రెడ్డి, భూపని వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ఫణీంద్రనాథ్, ద్వారకానాథ్, చంద్రశేఖర్, ఓబుల్‌రెడ్డితో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కందనవోలు 'నందు'ల నిలయం..! 7లో

చంద్రప్రభ వాహనంపై అహోబిలేశుడు

ఎగువ, దిగువ అహోబిలంలో కొనసాగుతున్న ఉత్సవాలు



ఎగువ అహోబిలంలో చంద్రప్రభ వాహనంపై జ్వాలా నరసింహస్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 8(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి దివ్యమంగళమూర్తులు భక్త నీరాజనాలు అందుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో శ్రీదేవీ, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారు ఉదయం శేష వాహనంపై కొలువై మాడవీధుల్లో విహరించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అర్చన నిర్వహించారు. తేజోమయుడైన జ్వాలా నారసింహుడు రాత్రి చంద్రప్రభ వాహనంలో విహరించారు. మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దిగువలో యోగ నృసింహ సేవ : దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరద స్వామికి యోగ నృసింహ గరుడ విమాన సేవ నిర్వహించారు. ప్రహ్లాదవరదుడిని ఉభయ దేవేరులతో యోగ నృసింహ అలంకరణలో కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్లను గరుడ విమానంపై కొలువుంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం రాత్రి ప్రహ్లాద వరదస్వామి హనుమంత వాహనంపై ఆశీనుడై మాడవీధుల్లో శోభాయమానంగా విహరించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి.

నేటి పూజా కార్యక్రమాలు

అహోబిల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి ఆదివారం ఉదయం ఉత్సవం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారు రాత్రి శరభ వాహనంపై భక్తాదులకు దర్శనమివ్వనున్నారు. అలాగే దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరద స్వామికి రెండు వాహన సేవలు నిర్వహించనున్నారు. ఉదయం శేష వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరించనున్నారు.



దిగువ అహోబిలంలో హనుమంత వాహనంపై ప్రహ్లాదవరద స్వామి

మహిళా సాధికారతకు ప్రభుత్వాలు కృషి

- ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నంద్యాల పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎంపీ, కలెక్టర్‌తో పాటు జేసీ విష్ణుచరణ్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన శాలలను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ స్త్రీ లేనిదే జననం, గమనం, సృష్టే లేదని, అలాంటి గొప్ప మానవత్వం ఉన్న మహిళామూర్తిని స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడి రాణిస్తుండటం గర్వకారణమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో కన్నుల పండువగా వేడుక నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. బ్యాంకు లింకేజీ కింద 6,880 మహిళా సంఘాల సభ్యులకు రూ.74.93 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ సర్వీస్ ద్వారా 2,455 మంది మహిళలు స్వయం ఆధారిత ఉపాధి ఉత్పత్తులను అందిస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈ కింద 37 మంది మహిళలకు గ్రౌండింగ్ యూనిట్లు, పీఎంఎఫ్‌ఎంఈ కింద 49మంది మహిళలకు ఉత్పత్తి యూనిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మెప్మా ద్వారా 6,100మంది మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు, ట్రయాంగిల్ సర్వీస్ ప్రొవైడర్స్ ద్వారా 389మంది మహిళలకు సర్వీసులు, 510మంది మహిళలకు జీవనోపాధి యూనిట్లు మంజూరు చేశామన్నారు. మైనార్టీ, వెనుకబడిన సంక్షేమ శాఖల ద్వారా కుట్టు మిషన్ల పంపిణీ, చదువుకొని ఖాళీగా ఉన్న మహిళలకు స్వయం ఉపాధి కింద పనులు కల్పించామని జిల్లాలో మహిళల పురోభివృద్ధిపై కలెక్టర్ వివరించారు. మహిళలు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ శబరి, కలెక్టర్ రాజకుమారి



నృత్యం చేస్తున్న కళాకారిణి

శ్రీగిరిలో వైభవంగా స్వర్ణ రథోత్సవం



స్వర్ణరథంపై స్వామి అమ్మవార్లు

శ్రీశైలం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున మల్లికార్జున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథాన్ని నేత్రశోభితంగా పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు స్వర్ణరథానికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లు ఆశీనులైన స్వర్ణరథం ఆలయ మాడవీధుల్లో అశేష భక్తజనం నడుమ వైభవంగా జరిగింది. స్వర్ణరథం ఎదుట కోలాటం, చెక్కభజన, జానపద కళాకారులు భక్తలను ఆకట్టుకుంది. భద్రతా ఏర్పాట్లను సీఐ ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కె. అయ్యన్న పర్యవేక్షించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

S ఆదివారం ప్రత్యేకం
u.n.d.a.y.s.p.e.c.i.a.l



హంగులతో రూపుదిద్దుకున్న టీజీవీ కళాక్షేత్రం

కందనవోలు నందుల నిలయం..!

- రాష్ట్రంలోనే 38 నంది పురస్కారాలు పొందిన ఏకైన సంస్థ
- అనునిత్యం సాహితీ, కళా ప్రదర్శనలు
- కళామతల్లి నుదుట మణిహారంగా టీజీవీ కళాక్షేత్రం
- ప్రోత్సాహకాలతో కళాకారులకు భరోసా

కాలి అందియల సవ్వడులు మదిని పరవశింపజేసినా... వేలి కదలికలతో మోగిన వీణాతంత్రులు శ్రవణానంద భరితమైనా.. ఆ ప్రత్యేకత ఆ కళాక్షేత్రానికే దక్కుతుంది. ముఖానికి రంగులు వేసుకొని, నట సింగాలైన నవోన్మేష కళాకారులకు, నవరసాలను హృద్యంగా ఒలికిస్తూ నాటకానికి ప్రాణం పోసిన నట కిరీటులకు ఆది నిలయం అది. అంతే కాదు...నాటి రాయలవారి భువన విజయాన్ని మరపించేలా అనునిత్యం సాహితీ సభలతో పరిఢవిల్లుతూ, అనేకానేక పుస్తకాల ఆవిష్కరణలతో, గొప్ప గొప్ప సాహిత్య వైతాళికులను కందనవోలుకు అందిస్తోంది. నటన, నాట్యం, సంగీతం, సాహిత్యం వంటి నాలుగు అంశాలను నేల నాలుగు చెరగులా చాటిచెబుతూ కందనవోలు కళామతల్లి నుదిట మణిహారంగా విరాజిల్లుతోంది. తన పదిహేనేళ్ల అప్రతిహత ప్రస్థానంలో ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా 38 రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డులు సాధించి, రాష్ట్రంలోనే ఏకైక కళాసంస్థగా విరాజిల్లుతోంది. అందే కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రం. ఏ ఆడిటోరియంలోనైనా అద్దెతోపాటు విద్యుత్తు, ఇతరత్రా సదుపాయాలకు సొమ్ము చెల్లించాలి. కానీ ఈ క్షేత్రంలో కళకు డబ్బు, భాష, ప్రాంతం, కొలమానం అంటూ ఏవీ లేవనే రీతిలో ఉచితంగా కళాకారులకు, కళాప్రదర్శనలకు అవకాశం కల్పిస్తోంది. పేద కళాకారులకు, దూరప్రాంతాల నుంచి వచ్చే కళాకారులకు తగురీతిలో ఆర్థిక సహకారాలు కూడా అందిస్తూ కళలను ప్రోత్సహిస్తూ కళల కాణాచిగా నిలుస్తోంది. వేలాది మంది ఔత్సాహిక కళాకారుల నిలయంగా టీజీవీ కళాక్షేత్రం అందిస్తున్న విభిన్న కార్యక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో 1970లో అప్పటి ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కేవీ చలపతిరావు, డిప్యూటీ కలెక్టర్ కె.వెంకటరెడ్డి, ఉపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్‌లు 'లలిత కళాసమితి' పేరుతో సంస్థను నెలకొల్పారు. సి.క్యాంపులోని 24 సెంట్ల స్థలాన్ని సేకరించారు. వీరి కృషి ఫలితంగా 1998లో మొట్టమొదట జరిగిన నంది నాటక పోటీల్లో ఐదు నందులతోపాటు జ్యూరీ అవార్డును 'నరనారాయణ' అనే నాటకం అందుకుంది. దీనికి సింహం లక్ష్మీనారాయణ దర్శకుడు. ఆయన దర్శకత్వంలో ఎన్నో పద్యనా టకాలు ప్రదర్శించారు. వ్యవస్థాపకుల్లో ఒకరైన సయ్యద్ అహ్మద్ సాంఘిక నాటకాలకు దర్శకత్వం వహిస్తూ ఎన్నో బహుమతులు సాధించారు. ఆ రోజుల్లో జంపాల శివయ్య అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక సమితి రూపురేఖలు మార్చేశారు. తర్వాత ఈ పరంపరను అధ్యక్షులుగా థామస్‌రెడ్డి, దస్తగిరి కొనసాగించారు. అప్పట్లో లలిత కళాసమితి ఓపెన్ ఎయిర్ థియేటర్‌గా ఉండేది.

జీవం పోసిన టీజీ వెంకటేశ్



రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాక్షేత్రానికి జీవం పోశారు. 2006లో ఆయన ప్రకటించిన భూరి విరాళంతో ఆరుబయలు కళామందిరం దశదిశ మారింది. అలాగే రూపులేఖలు మార్చుకొని 'టీజీవీ కళాక్షేత్రం'గా రూపాంతరం చెందింది. 2009లో ఆడిటోరియం లాంఛనంగా ప్రారంభమైంది. తర్వాత ఏసీ ఏర్పాటుతోపాటూ ప్రేక్షకులు హాయిగా కూర్చొని తిలకించే కుషన్ సీట్లు, లిఫ్ట్ ఏర్పాటు, అగ్నిమాపక సౌకర్యం కల్పించారు. టీజీవీ కళాక్షేత్రం ప్రాంగణంలో రెండంతస్తుల భవన నిర్మాణానికి టీజీ వెంకటేశ్ తిరిగి రూ.3 కోట్లు విరాళం అందజేశారు. ఫలితంగా నవ్యాంధ్ర రాష్ట్రంలోనే అన్ని హంగులు ఉన్న కళామందిరంగా రూపొందింది. దాదాపు మూడున్నర కోట్ల విరాళం అందజేసిన టీజీ వెంకటేశ్ పేరుపైన టీజీవీ కళాక్షేత్రంగా ఆనాటి శాశ్వత సభ్యుల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. 2009 నుంచి టీజీవీ కళాక్షేత్రం నవ్యశోభితంగా ఆవిష్కృతమైంది.



నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి నుంచి 'తానా' పురస్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య

నాటక చరిత్రలో ఎన్నో మైలు రాళ్లు

టీజీవీ కళాక్షేత్రం పక్షాన కళాకారులు తమదైన ప్రతిభను దేశవ్యాప్తంగా చాటిచెబుతున్నారు. కళాక్షేత్రం నాటక రంగ చరిత్రలో 'పులిస్వారీ' నాటకం ప్రత్యేకంగా నిలిచిపోతుంది. సుమారు 200 ప్రదర్శనలు రాష్ట్రవ్యాప్తంగా ఆడిన ఈ నాటకం నాటి రాయలసీమలోని ముఠాకక్షల నిర్మూలనకు ఎంతో దోహదం చేసింది. ఈ నాటకం జిల్లాలోని ఫ్యాక్షన్ ప్రాంతాల్లోనూ ప్రభావితం చూపించింది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న గ్రామాల్లోకి వెళ్లాలంటే భయపడే రోజుల్లో కళాక్షేత్రం కళాకారులు వెళ్లి ధైర్యంగా ప్రదర్శనలు ఇచ్చారు. కప్పట్రాళ్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు వంటి ఫ్యాక్షన్ ప్రాంతాల్లో నాటకాలను ప్రదర్శించారు. అలాగే రెండు నంది బహుమతులు, అనేక పరిషత్తుల్లో ఉత్తమ ప్రథమ బహుమతులను అందుకుంది.

నంది అవార్డుల పంట

రాష్ట్ర ప్రభుత్వం సినిమా, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ద్వారా ఏటా నిర్వహించే నంది నాటక పోటీలకు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు పోటీ పడుతున్నారు. 1998లో నాటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన నాటక రంగ నంది పురస్కారాల్లో మొట్టమొదటి ఏడాది 1998లో నరనారాయణ నాటకానికి 5 నందులు, 1999లో పులిస్వారీకి 2, మబ్బుల్లో బొమ్మకు 1, 2000లో కృష్ణాభిమాన్యుకు ఒకటి, 2004లో భక్తమాధవదాసుకు ఒకటి, 2007లో శ్రీకృష్ణాభిమన్యుకు 2, 2009లో మహారథి కర్ణకు ఒకటి, 2011లో ఓమనిషీ నీకు జోహార్లుకు 2, 2012లో బభ్రువాహన విజయంకు ఒక బంగారు, 3 వెండినందులు, 2014లో శ్రీకృష్ణాభిమన్యుకు 3 నందులు, 2015లో కర్ణార్జునీయంకు 4 నందులు, 2016లో ప్రమీలార్జున పరిణయంకు ఏకంగా 7 నందులు లభించాయి. 2017లో సైసై నరసింహారెడ్డికి 3, 2023లో శ్రీకృష్ణకమలపాలిక పద్యనాటకానికి రెండు నందులు వచ్చాయి. ఇవే కాక, తిరుపతి, ఒంగోలులో జరిగే జాతీయ నాటక పోటీల్లోనూ ప్రథమ బహుమతులు గెల్చుకున్న ఘనత టీజీవీ కళాకారులకు దక్కుతుంది.



ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నంది పురస్కారం అందుకుంటున్న నాటక దర్శకుడు పత్తి ఓబులయ్య

ప్రతిరోజూ సాహితీ, సాంస్కృతిక సేవలో

టీజీవీ కళాక్షేత్రంలో ఏడాదిలో ప్రతిరోజూ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. ప్రతి 'ఆదివారం సాంస్కృతిక కార్యక్రమం', ప్రతి నెలా చివరి ఆదివారం 'నాటకం', అలాగే సాంఘిక నాటిక, కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అలాగే బాలల కోసం ప్రత్యేకంగా 'టీజీవీ అకాడమీ' పేరుతో చిన్నారులకు నృత్య శిక్షణలు వారంలో రెండు రోజులు ఏర్పాటు చేశారు. అలాగే వేసవిలో బాలల కోసం ప్రత్యేకంగా నృత్య, నటన, చిత్రలేఖన, వక్తృత్వ శిక్షణలు ఇస్తూ వారిని కళారంగం పట్ల ప్రోత్సాహం కల్పిస్తున్నారు.

సాహిత్యానికి సముచిత స్థానం

టీజీవీ కళాక్షేత్రంలో కళాప్రదర్శనలతోపాటు నిత్యం సాహిత్య కార్యక్రమాలు విరాజిల్లుతున్నాయి. ఈ క్షేత్రంలో ప్రత్యేకంగా సాహితీవేదికను ఏర్పాటు చేశారు. అనేక పుస్తకావిష్కరణలు, సాహిత్య సభలు, సమావేశాలు నిర్వహిస్తూ సాహిత్యక్షేత్రాన్ని సుసంపన్నం చేస్తున్నారు. గతంలో గరికపాటి నరసింహారావు ఉపన్యాసం చేశారు. అలాగే శివారెడ్డి, ఆచార్య కొలుకలూరి ఇనాక్, సినీ గీత రచయిత గోరటి వెంకన్న వంటి అనేక మంది సాహితీ ప్రముఖులు ఇక్కడి కార్యక్రమాలకు హాజరయ్యారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖంగా నిలిచే శతావధానం వంటి కార్యక్రమాలు సాహితీప్రియులను అలరింపజేస్తున్నాయి.

ఆదాయ పన్ను మినహాయింపు

టీజీవీ కళాక్షేత్రం నేడు 12ఏ మినహాయింపు క్షేత్రంగా సేవలు అందిస్తోంది. కళలు, సాహిత్య రంగాలకు అందిస్తున్న సేవలకు గాను ఆదాయ పన్ను శాఖ 12ఏ సౌకర్యం కల్పించడంతోపాటూ, ఈ కళాక్షేత్రం పురోభివృద్ధికి, కార్యక్రమాల నిర్వహణకు డొనేషన్ల రూపంలో దాతలు సొమ్ము అందజేస్తే వారికి 80జీ (పన్ను మినహాయింపు) సౌలభ్యం కల్పిస్తోంది. కళాక్షేత్రానికి ఇచ్చే విరాళాలను తమ ఆదాయ పన్నులో మినహాయింపు పొందే అవకాశం నాటి టీజీవీ కళాక్షేత్రం ఛైర్మన్, ప్రస్తుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కల్పించారు.



పత్తి ఓబులయ్యకు అక్కినేని, సి.నారాయణ రెడ్డిలతో సత్కారం



టీజీవీ కళాక్షేత్రం లోని వేదిక

మూడుసార్లు సీఎం చంద్రబాబుతో పురస్కారాలు



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మూడుసార్లు మూడు నంది అవార్డులు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కళామతల్లికి సేవలు అందించడమే లక్ష్యంగా టీజీవీ కళాక్షేత్రం ముందుకు పోతోంది. టీజీవీ కళాక్షేత్రం ప్రస్తుత ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ సహకారం ఎన్నటికీ మరువలేనిది. ఆయన ఆర్థికంగానే కాకుండా, హార్దికంగా ఇచ్చిన చేయూత నేడు నగరంలో టీజీవీ కళాక్షేత్రం ఒక స్థానం సంపాదించుకుంది. కళామతల్లికి సేవ చేయాలనే ఆయన ప్రోత్సాహమే మమ్మల్ని నడిపిస్తోంది. టీజీవీ కళాక్షేత్రం ప్రదర్శించే పద్య నాటకాలకు నేను దర్శకత్వం వహిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తున్నాం. అలాగే అనేక పురస్కారాలు సాధిస్తున్నాం. మేమే కాకుండా ఎవరు సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించినా, కళాక్షేత్రం అన్ని సౌకర్యాలతో పాటూ ఉచిత విద్యుత్తును కూడా కల్పిస్తూ వారికి అవకాశం ఇస్తోంది. స్థానిక కళాకారులకు ప్రోత్సాహంతోపాటూ, ఇతర ప్రాంతలకు చెందిన కళాకారులకు కూడా చేయూత ఇచ్చే విధంగా కార్యక్రమాలు నెలపొడవునా నిర్వహిస్తున్నాం.

- పత్తి ఓబులయ్య, అధ్యక్షుడు, టీవీజీ కళాక్షేత్రం

మల్లన్న సేవలో ప్రముఖులు



శ్రీశైలంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

శ్రీశైలం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను శనివారం రాత్రి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ప్రముఖులకు రాజగోపురం వద్ద దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, వేదపండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రతేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితులు, అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈవో శేషవస్త్రాలతో వారిని సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను, ప్రసాదాన్ని అందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 'కుడా' ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ముంతాజ్, కార్పొరేటర్ క్రైపా పద్మలతారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డితో కలిసి కేక్ కట్ చేసి మహిళలు, నాయకులు, కార్యకర్తలు మధ్య కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు, సీఎం చంద్రబాబు నాయుడు నిత్యం మహిళా సంక్షేమానికి చరిత్రలో నిలిచిపోయే పథకాలు తీసుకొచ్చారని అన్నారు. కేవీ సుబ్బారెడ్డి సహకారంతో ముగ్గురు మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, పార్టీ గుర్తుగా సైకిల్‌ను ఓ యువకుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు చౌదరి, చంద్రకాంత్, సత్రం రామకృష్ణుడు, షేక్షావలి, మల్లేశ్వరి, రాణి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎం. హరికిషన్‌కు జాతీయ పురస్కారం



హరికిషన్‌ను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ బాలల సాహితీవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ శనివారం కడప జిల్లా ప్రొద్దుటూరులో 'కొనిరెడ్డి ఫౌండేషన్' జాతీయ పురస్కారం అందుకున్నారు. ప్రొద్దుటూరులోని ఎస్కే గ్రాండ్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, ప్రముఖ సామాజిక సేవకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు. జాతీయ పురస్కార గ్రహీతను నిర్వాహకులు శాలువ, పూలదండలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఎం. హరికిషన్ రాసిన 'చిలక ముక్కు చిన్నోడు' కథల పుస్తకానికి జాతీయ పురస్కారం లభించింది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

మిడుతూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామ పొలిమేరలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. భిక్షాటన చేసుకొని జీవిస్తున్న వృద్ధుడు తలముడిపి బాటకు, మంచాలకట్ట గ్రామం మధ్యలో రోడ్డు పక్కన పొలాల కాలువలో పడి మృతి చెందాడు. మృతుని శవం వద్ద భిక్షాటన చేసుకున్న చిల్లర పైసలు, పళ్లెం, పాత బట్టలు ఉన్నాయి. ఎస్ఐ ఓబులేసు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించారు.

బైకు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కర్నూలు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్ల మద్దయ్య (55) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. కొడుకు ఎల్లస్వామితో కలిసి మద్దయ్య బైక్‌పై వెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. వెల్దుర్తికి చెందిన ఎల్ల మద్దయ్య స్థానిక ఆలయంలో పూజారిగా పని చేస్తున్నాడు. కొడుకుతో కలిసి కర్నూలు వచ్చి తిరిగి వెల్దుర్తికి వెళుతుండగా మార్గమధ్యంలో చిన్నటేకూరు వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్ ఫ్లైఓవర్ వద్ద రైలింగ్‌ను ఢీకొట్టింది. బైక్ మీద వెనుక కూచున్న ఎల్లమద్దయ్య కింద పడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

బండిఆత్మకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏ కోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్ర గాయాలపాలయ్యారు. తెలిపిన శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఏ కోడూరుకు చెందిన శ్రీనివాసులు మోటర్ బైక్‌పై పొలం దగ్గరికి వెళ్తూ మలుపు తిప్పుతుండగా.. వెనుక నుంచి మోటార్ బైక్‌పై వచ్చిన చంద్రశేఖర్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు, నంద్యాలకు వెళ్తున్న కాకనూరుకు చెందిన చంద్రశేఖర్ రక్త గాయాలపాలయ్యాయి. ఇరువురిని స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. చంద్రశేఖర్ తండ్రి 8 నెలల క్రితమే పాముకాటుతో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు బండిఆత్మకూరు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

వంట మాస్టర్ ఆత్మహత్య

నంద్యాల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన వంటమాస్టర్ సురేష్ (43) శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు నంద్యాల తాలుకా పోలీసులు తెలిపారు. సురేష్ భార్య 2023లో మరణించిందని, ఆ బాధ తట్టుకోలేక అప్పటినుంచి సురేష్ మద్యానికి బానిసైనట్లు చెప్పారు. శనివారం ఇంటిముందు రసాయన ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

బైకు కొనివ్వలేదని యువకుడు..

పగిడ్యాల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బైకు కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పగిడ్యాల మండలంలోని కె.ముచ్చుమర్రిలో జరిగింది. ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. కొత్త ముచ్చుమర్రికి చెందిన బోయ వెంకటేశ్వర్లు కుమారుడు శివరాం (21) పదో తరగతి వరకు చదువుకొని డ్రైవర్ పని చేస్తున్నాడు. తనకు బైకు కొనివ్వాలని యువకుడు కొన్ని రోజులుగా తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాడు. ఈ విషయంపై శుక్రవారం రాత్రి తండ్రీకొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. శివరాం శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని..

రుద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భార్య లక్ష్మీదేవి పుట్టింటికి వెళ్లిందని భర్త ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఎర్రగుడిదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (30) మద్యానికి బానిస కావడంతో ఆయన భార్య లక్ష్మీదేవి ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకుతో కడప జిల్లా ముద్దనూరు మండలం కోసినేనిపల్లె గ్రామం పుట్టింటికి వెళ్లింది. దీనిని జీర్ణించుకోలేక భర్త తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

కొలిమిగుండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో ఈనెల 6న బిజ్జం మనోహ రమ్మ(37) అనే మహిళను హత్య చేసిన ఘటనలో మృతురాలి భర్త బిజ్జం చిన్న వెంకటరామిరెడ్డిని శనివారం అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేశ్‌బాబు వెల్లడించారు. ఈమేరకు నిందితుడ్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. నిందితుడు మద్యానికి బానిసగా మారి, చెడు అలవాట్లతో భార్యను వేధించేవాడని, ఈ క్రమంలో గురువారం మనోహరమ్మ డబ్బు ఇవ్వలేదన్న కారణంతో రోకలి బండతో దాడి చేశాడని సీఐ తెలిపారు. బనగానపల్లె ఆసుపత్రిలో ఆమె మృతి చెందిందన్నారు. నిందితుడిని శనివారం అంకిరెడ్డిపల్లె సమీపంలో అరెస్ట్ చేసి కోవెలకుంట్ల మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

మహిళా సాధికారతకు కృషి: మంత్రి బీసీ



బనగానపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి బీసీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు హయంలోనే డ్వాక్రా మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారి జీవనోపాధుల అభివృద్ధుల కోసం కృషి చేసినట్లు తెలిపారు. మహిళల సాధికారత కోసం సీఎం చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి



మహిళలను సన్మానిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మహిళలను గౌరవించే పార్టీ టీడీపీయేనన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించేలా పార్టీ తోడ్పాటు అందిస్తుందన్నారు. అనంతరం మహిళా నాయకులను శాలువాలతో సన్మానించారు.

ఎస్టీ జాబితాలో చేర్చితే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న బాలునాయక్

నంద్యాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే సహించే ప్రసక్తిలేదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5న అసెంబ్లీ సమావేశంలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కూడా ఈఅంశంపై వాల్మీకులకు మద్దతు తెలుపుతూ కేంద్ర మంత్రి అమిత్‌షాకు వినతి పత్రం ఇవ్వడం గిరిజనులకు అన్యాయం చేయడమేనన్నారు. గిరిజనుల సంక్షేమంలో పాలుపంచుకోవడంలో ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయడం బాధాకరమన్నారు. వైసీపీ ప్రభుత్వం జీవో నెం 52ను ప్రవేశపెట్టడంతో రద్దు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసినట్లు గుర్తు చేశారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

నంద్యాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తానని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం నంద్యాల పట్టణ రైతుబజారులో ఫిష్ ఆంధ్ర హబ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మత్స్య సంపద యోజన పథకంలోని ఫిష్ హబ్‌కు రూ.50 లక్షలకుగాను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకార సొసైటీల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం సహకరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ గోరుకల్లు, అవుకు, బనగానపల్లె సొసైటీల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. ఇప్పటికే గిరిజన సొసైటీ హరినగరంలోని తుండ్లవాగులో నాలుగు లక్షల చేపలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సహాయ సంచాలకులు పామన్న, నిర్వాహకులు రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

యాత్రలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణ సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు శనివారం నుంచి ఈ నెల 17 వరకు చేపడుతున్న ఆందోళనలో ప్రజలను భాగస్వాములను చేయాలనిపిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ చేతుల్లో పెడుతోందని ఆరోపించారు. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేదని కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి ఆశీస్సులు ఉండాలి



బండి ఉత్సవంలో పాల్గొన్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలందరికీ అహోబిల నరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు ఆకాంక్షించారు. శనివారం మూలసాగరం ప్రజలు ఆనవాయితీ ప్రకారం అహోబిలం బ్రహ్మోత్సవాలను పురష్కరించుకొని బండి ఉత్సవం ఏర్పాటు చేశారు. ఈ ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అభిరుచి మధు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అహోబిల బ్రహ్మోత్సవాలకు అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ప్రతి ఇంటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తోచినంత సాయం చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, ఉపేంద్ర నాథ్ రెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

బండిఆత్మకూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పశువులకు విధిగా గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించాలని వీఎల్‌వో నూర్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలోని సంతజూటూరు గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. రైతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, మూగజీవాలు అస్వస్థతతో ఉంటే వెంటనే సమీపంలోని పశువైద్యశాలలకు తీసుకెళ్లి చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో వీఏ పాపిరెడ్డి, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి కృషి

ఆత్మకూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వచ్చే వినతుల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సుమారు 150 వినతులను ఎమ్మెల్యే బుడ్డాకు అప్పగించగా అందులో ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఎడ్యుకేషన్ తదితర శాఖలకు చెందిన దరఖాస్తులు వచ్చాయి. ఆయా వినతులను నిర్ధిష్ట గడువులోగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

భూములను కాజేయాలని చేస్తే ఉపేక్షించను

నందికొట్కూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దళితుల భూములను కాజేయాలని చూస్తే ఉపేక్షించేది లేదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా పట్టణ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరిం చే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి



ఎమ్మెల్యే గిత్తా జయసూర్య దంపతులకు సన్మానం

ఘనంగా మహిళా దినోత్సవం



నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయ కూడలిలో మానవహారం చేపట్టిన ఏఎస్పీ జావలి, మహిళా పోలీసులు



మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

నంద్యాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి చైతన్యానికి స్ఫూర్తి అని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం పట్టణంలోని సూరజ్ హోటల్‌లో బదిరిలు (చెవిటి, మూగ) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో మహిళలు పురుషులతో ఏమాత్రం తీసిపోకుండా అన్నింటా ప్రతిభ చూపుతూ అవనికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

నంద్యాల క్రైం : మహిళల సాధికారతతోనే దేశ పురోభివృద్ధి సాధ్యమని అడిషనల్ ఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక చామకాల్వ వై జంక్షన్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. బేటీ బచావో.. బేటీ పడావో.. స్త్రీలను గౌరవిద్దాం సమాజాభివృద్ధికి తోడ్పడదామంటూ నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడి నుంచి స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ తోపాటు జిల్లా సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, డీఐఈవో సునీత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. వారం రోజులుగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జయరాములు, కంబగిరి రాముడు, రమేష్‌కుమార్, మోహన్‌రెడ్డి, సూర్యమౌళి, సుధాకర్‌రెడ్డి, ఇస్మాయిల్, కృష్ణయ్య, మహిళా ఎస్సైలు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: రాష్ట్రంలో మహిళా స్వయం సాధికారత సాధించడంలో తెలుగు దేశం పార్టీ కీలక పాత్ర పోషించిందని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ వహీద్ హుస్సేన్ అన్నారు. శనివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర కార్యాలయంలో పని చేస్తున్న వారికి చీరలు పంపిణీ చేశారు.



నందికొట్కూరు కోర్టులో కేక్ కట్ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి దివ్య

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల ఏపీటీఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌లు సుకుమాంబ, రమాబాయి, సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ అధ్యక్షతన మహిళా ఉపాధ్యాయినిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం సంఘాలు చేసే పోరాటాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. మహిళా ఉద్యోగినులు వారు పనిచేసే కార్యాలయాల్లో అనేక అవమానాలు ఎదుర్కొంటున్నారని, వీటన్నింటినీ ఐకమత్యంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు సునీత, సుజాత, శ్రీలత, శశికళ, సాయినిరంజిని పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్, పొదుపు సంఘం కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సుభద్రమ్మ, తెలుగు మహిళా ఆర్గనైజింగ్ సెక్రెటరీ వడ్డె లక్ష్మి ఆధ్వర్యంలో పొదుపు సంఘం కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పొదుపు మహిళా సంఘం అధ్యక్షురాలు ఎల్లమ్మ, సెక్రటరీ లలిత, కోశాధికారి రేష్మా పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరులోని మహిళా సమైఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏపీఎం సుబ్బయ్య, మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాతా రమేష్ రెడ్డి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో శివరామిరెడ్డి, సర్వోత్తమరెడ్డి, మనోహర్ రెడ్డి, నరసింహగౌడు, సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

నంద్యాల హస్పిటల్: భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డా.మధుసూదన్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా, నంద్యాల ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.శ్రీదేవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయకుమారి, నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, కవయిత్రి రత్నలక్ష్మి, సామాజిక సేవలందిస్తున్న వెంకటేశ్వరిలకు ప్రశంసా పురస్కారాలను అందజేశారు. అనంతరం పురస్కార గ్రహీతలను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సహదేవుడు, రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీసౌజన్యం, వర్కింగ్ కమిటీ సభ్యులు డా.వసుధ, డా.హరిత, నంద్యాల శాఖ కార్యదర్శి డా.అనూష, మిషన్ పింక్ హెల్త్ కార్యదర్శులు డా.సుసుమ, డా.శైలజ పాల్గొన్నారు.

ఆత్మకూరు: రాజకీయాలతో సంబంధం లేకుండా పేదలకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పేరు చెప్పి తన అనుచరులతో సహా ఎవరైనా డబ్బు వసూళ్లు చేస్తే సహించేది ఉండదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నీలితొట్ల వీధిలో చోటు చేసుకున్న మరణాలపై తప్పుడు విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మహిళలకు దివంగత ఎన్టీఆర్ ఆస్తిలో భాగం కల్పించారని, సీఎం చంద్రబాబుకు మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం వివిధ రంగాల్లో స్వశక్తితో జీవనం సాగిస్తున్న ఆరుగురు మహిళలను సత్కరించి వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. అలాగే మహిళా అధికారులను, ప్రజాప్రతినిధులను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఎంపీపీ తిరుపాలమ్మ, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్ట్ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా ఉన్నారు.

ఆత్మకూరు: మహిళల అభ్యున్నతితోనే సమాజ ఉన్నతి సాధ్యపడుతుందని ఆత్మకూరు అర్బన్ సీఐ డి.రాము అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసు స్టేషన్ పని చేస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.

● **నందికొట్కూరు:** సమాజంలో మహిళలు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మెప్మా, డీఆర్‌డీఏ, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. 152 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకి లింకేజీ కింద మంజూరైన రూ.16 కోట్ల 33 లక్షల మెగా చెక్‌ను అందజేశారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆయన సతీమణి సరస్వతిలను సభా నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు మందడి వాణి, జాకీర్, భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ముర్తుజావళి, రవీంద్రారెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బేబి, తహసీల్దార్ శ్రీనివాసులు మెప్మా అధికారిని శాంతాకుమారి, ఏసీడీఎస్ ఏసీడీపీవో మంగవెల్లి పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి దివ్యలు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్‌లో 266 కేసులు రాజీ అయ్యాయి.

వెలుగోడు: మహిళలు పురుషులతో పాటు సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని, మాజీ ఎంపీపీ సీతాలక్షమ్మ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సరస్వతి శిశు మందిరం పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.



పురస్కార గ్రహీతలను సన్మానిస్తున్న నంద్యాల వైద్యులు



మిడుతూరులో మహిళా సర్పంచులకు సన్మానం



గడివేములలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం



ఆత్మకూరులో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం



స్వయం ఉపాధిలో రాణించిన మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

అమ్మవారికి ప్రభాత పూజ



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జనని దేవికి శనివారం ఉదయం ప్రభాత పూజ నిర్వహించారు. వివిధ రకాల పండ్ల దండలతో అమ్మవారి ఆలయాన్ని అలంకరిచారు. భక్తులు అమ్మవారికి సహస్రనామ, కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం ప్రదోషపూజలు, మహా మంగళహారతి నిర్వహించారు.

● అహోబిళం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం అన్నప్రసాద వితరణ కోసం దాతల సహకారంతో సరుకులు పంపిస్తున్నట్లు చెప్పారు.

దుర్గా భోగేశ్వరుడికి వెండి కవచం



వెండి కవచాన్ని అందజేస్తున్న భక్తులు

గడివేముల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరస్వామికి నంద్యాల పట్టణానికి చెందిన ఉమామహేశ్వరరావు, లక్ష్మీబాయిల జ్ఞాపకార్థం వారి కుమారుడు లీలాకుమార్ దంపతులు వెండి కవచాన్ని బహూకరించారు. రూ.2.50 లక్షల విలువ చేసే వెండి కవచాన్ని శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి రామానుజన్, ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డిలకు అందజేశారు. దాతలను ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్‌శర్మ పాల్గొన్నారు.

రుద్ర కోటీశ్వరాలయంలో కర్ణాటక భక్తులు



పాదయాత్రగా క్షేత్రానికి చేరుకుంటున్న కర్ణాటక భక్తులు

ఆత్మకూరు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్యం పరిధిలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి కర్ణాటక ప్రాంతం నుంచి సుమారు 160 మంది భక్తులు శనివారం తర లివచ్చి రుద్రకోటీశ్వరుడిని దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్రం దేవదుర్గ తాలూకాలోని కృష్ణా నది ఒడ్డున ఉన్న అడవిలింగ మహారాజాశ్రమం గురువు శివస్వామికి చెందిన సుమారు 160 మంది శిష్య బృందం వివిధ వాహనాల్లో ఈ క్షేత్రానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. క్షేత్రానికి ఒక కిలోమీటర్ దూరం నుంచి పాదయాత్రగా శివనామస్మరణ చేసుకుంటూ క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయంలో వెలసిన రుద్రాణి సహిత రుద్రకోటేశ్వర స్వామివార్లకు పురోహితులు యజ్ఞనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలాగే నాగులకట్ట వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే క్షేత్రంలోని కల్పవృక్షం చుట్టూ ప్రదర్శనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

319 కేసుల పరిష్కారం

ఆత్మకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులు, శ్రీశైలం బెంచ్ కోర్టు నందు శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 319 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు, శ్రీశైలం పోలీసుస్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో 252 చిన్నపాటి కేసులతోపాటు 8 మోటార్ వెహికల్ యాక్ట్ కేసులు, 20 ఐపీసీ క్రిమినల్ కేసులు, 4 సివిల్ కేసులను పరిష్కరించారు. అలాగే 22 బ్యాంకు కేసులను పరిష్కరించి రూ.4,73,500 రికవరీ చేశారు. 13 ఎక్సైజ్ కేసులను పరిష్కరించి రూ.99,270 జరిమానా విధించారు.

డ్రోన్ కెమెరాతో నల్లమల పర్యవేక్షణ



నల్లమలలో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలిస్తున్న ఎస్ఐ

మహానంది, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో సరిహద్దుల్లోని నల్లమల తీరాన డ్రోన్ కెమెరా సహాయంతో పోలీసులు పర్యవేక్షించారు. శనివారం మహానంది సమీపంలోని పాలేరువాగు, తెలుగంగ ప్రధాన కాల్వ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను ఉపయోగించి పోలీసులు అనుమానాస్పద పరిసరాలను తనిఖీ చేశారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు, ఓపెన్ పరిసరాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టేందు డ్రోన్ కెమెరా ద్వారా సిబ్బంది సహాయంతో పరిశీలించామని ఎస్ఐ తెలిపారు.

హెల్మెట్ ధరించాలి

పాములపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం పాములపాడు బస్టాండు ఆవరణలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు తల్లిదండ్రులు మోటారుసైకిళ్లు ఇవ్వరాదని, అలా ఇస్తే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మేకల బండ వీటీడీఏ ఎన్నిక ఏకగ్రీవం

సున్నిపెంట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని మేకల బండ చెంచు గిరిజన గూడెంలో శనివారం వీటీడీఏ ఎన్నిక ఏకగ్రీవమైంది. మేకల బండ చెంచు గూడెంలోని కమ్యూనిటీ హాల్‌లో శ్రీశైలం తహసీల్దార్ కేవీ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో మేకల బండ చెంచు గుడెం వాసులు, పొదుపు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. గుడ్ల మల్లయ్యను అధ్యక్షునిగా, కార్యదర్శిగా చిగుల్ల భ్రమరాంబను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వెలుగోడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలోని మాదవరం గ్రామానికి చెందిన భూపాల్ అనే వ్యక్తి శనివారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సలు నిర్వహించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు.

లోక్ అదాలత్‌లో 204 కేసులు పరిష్కారం

కోవెలకుంట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ లోక్ అదాలత్‌తో 204 కేసులు పరిష్కారం అయినట్లు కోవెలకుంట్ల సివిల్ కోర్టు న్యాయాధికారి షేక్ అబ్దుల్‌రహిమాన్ అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీ వసంత లక్ష్మి, కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్, న్యాయవాది సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు తిరుపాలు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి నాగశేషు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం చాగలమర్రి పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పలు కేసుల గురించి విచారించారు. పెద్దవంగలి దస్తగిరిస్వామి దర్గా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదన్నారు. సమావేశంలో ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్, ఏఎస్‌ఐ నబీసాహెబ్, హెచ్‌సీలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొలిమిగుండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆదివారం మెయింటెన్స్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మణస్వామి శనివారం వెల్లడించారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యం దుకాణాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని మద్యం దుకాణాలను ఆళ్లగడ్డ ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసులు కలిసి శనివారం రాత్రి తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు, మల్లేవేముల రహదారి, పెట్రోలుబంకు సమీపంలోగల మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఆళ్లగడ్డలోని మద్యం దుకాణాల్లో కూడా తనిఖీ చేశారు.

కూలిన మహా వృక్షం

కొలిమిగుండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్విమానుపల్లెలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల సమీపంలో వెలసిన సుంకులమ్మ ఆలయ ప్రాంగణంలోని మహా వృక్షం నేల కూలింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న వేపవృక్షం భక్తులకు నీడ నిచ్చేది. అయితే ఒక్కసారిగా వృక్షం కూలిపోవడంతో గ్రామస్థులు చూడటానికి తరలివచ్చారు. కాగా కూలిన చెట్టు ఆలయంపై పడటంతో గుడి పైకప్పు పాక్షికంగా దెబ్బతినింది. దీంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

బనగానపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని ఆస్థానం రోడ్డులో వాసవి జాగృతి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గుండా రవికుమార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బనగానపల్లె వాసవి జాగృతి క్లబ్ అధ్యక్షురాలు గుండా సుప్రజ , ఫణి , పలువురు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.28 లక్షలు

బేతంచెర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.28 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు

బేతంచెర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బేతంచెర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.1.43 కోట్లు మంజూరు అయినట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ శనివారం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో డ్రైనేజీల కాలువలు, తాగునీటి సమస్య పరిష్కారానికి, వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

వైసీపీ హయాంలోనే కక్ష సాధింపు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి

బనగానపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలోనే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులపై కక్ష్య సాధింపుచర్యలకు పాల్పడ్డారని టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, బనగానపల్లె పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్ విమర్శించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మహిళ అని చూడకుండా టీడీపీ నాయకురాలు అయిన బీసీ ఇందిరమ్మపై దాడులు చేసింది కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుళరెడ్డి కాదా అని ప్రశ్నించారు. బనగానపల్లెలో తొమ్మిది నెలల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత మంత్రి బీసీదన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖాశీంబాబు, బనగానపల్లె ఆస్పత్రి కమిటీ సభ్యుడు నియాజ్‌హుసేన్, పూల కలాం తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

చాగలమర్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె వెల్లాల క్షేత్రంలో వెలసిన సంజీవరాయ, వెంకటేశ్వరస్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి మహన్యాస రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా గోవిందనామ పారాయణం నిర్వహించారు. సంజీవరాయస్వామికి తమలపాకులతో పూజలు చేశారు.

కుక్కల దాడిలో రైతుకు తీవ్రగాయాలు

సంజామల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానాల గ్రామంలో కుక్కల దాడిలో రైతు బుడ్డయ్యగారి చంద్రశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. కానాల పంట పొలాల్లో ఉన్న చంద్రశేఖర్ రెడ్డిపై 5 కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఆయనకు రక్తగాయాల య్యాయి. చంద్రశేఖర్‌రెడ్డిని కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఆళ్లగడ్డలో మెమొంటోలు అందుకున్న విద్యార్థినులతో డీఎస్పీ ప్రమోద్



చాగలమర్రి మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవిని సన్మానిస్తున్న మహిళలు



దొర్నిపాడులో మహిళలను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది



కోవెలకుంట్లలో ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్క నాటుతున్న బీసీ ఇందిరమ్మ ఇతరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

డోన్ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని టీడీపీ కార్యాలయంలో పాతపేటకు చెందిన దివ్యాంగురాలు రాణిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, వకృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ నీరజ, టౌన్ ఎస్‌ఐ నగీనా, అపుష్మ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, లావణ్య పాల్గొన్నారు.

● శిరివెళ్ల మండలంలోని యర్రగుంట్ల, గాంధీనగరం, రాజనగరం గ్రామాల్లో హెరిటేజ్ డెయిరీకి పాల సేకరణ ప్రతినిధులైన తాళ్లూరి వెంకట లక్ష్మమ్మ, జానకీదేవి, శివరాధను అయ్యలూరు హెరిటేజ్ డెయిరీ మేనేజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శాలువా, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు.

● ఆళ్లగడ్డలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ రామలింగారెడ్డి, కమిషనర్ కిషోర్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, పలు వురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మహిళలు ఆత్మస్థైర్యంతో మెలగాలని ఎరుకుల సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ మనోరమ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని తమ కార్యాలయంలో ఆమె మహిళలతో సమావేశాన్ని నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు పాఠశాల, వెలుగు కార్యాలయాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీబజార్‌లో మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవిని మహిళలు ఘనంగా సన్మానించారు. గొడిగనూరు పాఠశాలలో ఎంఈవో అనూరాధను హెచ్‌ఎం ఓబుళపతి, ఉపాధ్యాయులు సన్మానించారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం నాగమ్మ ఆధ్వర్యంలో పొదుపు మహిళలు పురవీధుల గుండా మహిళా దినోత్సవ ర్యాలీని నిర్వహించారు.

దొర్నిపాడు: మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు సాధిస్తున్నారని వెలుగు ఏపీఎం బాబు అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపీఎం, మండల సమాఖ్య ఆధ్వర్యంలో పొదుపు మహిళలను ఘనంగా సన్మానించారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మ హిళా దినోత్సవాన్ని ముఖ్య అతిథిగా రాష్ట్ర టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ హాజరయ్యారు. సంస్కృత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కొద్దిసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సభ్యులు ఇందిరమ్మను సన్మానించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ సముద్రాల శ్రీనివాసులు, బ్యాంకు సిబ్బంది , నాయకులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో రమణ, ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మహిళలు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్ర మంలో మండల మహిళా అధ్యక్షురాలు పక్కూర్‌బీ, డ్వాక్రాసంఘాల మహిళలు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో డీఎల్‌పీవో, ఓపీలు, ఆర్పీల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

● ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో:

అలాగే పట్టణంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకులకు డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని, వారి ఆరోగ్యాలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్య క్రమంలో భారత్‌గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ రాజా విజయ కుమార్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: సమాజంలో మహిళలదే ముఖ్య పాత్ర అని, అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ పర్వీన్, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, కౌన్సిల్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది, మెప్మా కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మహిళలకు అందజేశారు. అనంతరం మహిళ పారిశుధ్య కార్మికులను సన్మానం చేశారు.



టీడీపీ కార్యాలయంలో దివ్యాంగురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే



డోన్ మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న కమిషనర్



డోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న న్యాయాధికారి తంగమణి, ఉపాధ్యాయులు



బనగానపల్లెలో బహుమతులు పంపిణీ చేస్తున్న ఏపీఎం శ్రీనివాసులు



బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు, కమిషనర్



గొడిగనూరు పాఠశాలలో ఎంఈవో అనూరాధను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పరిశ్రమకు అప్పగించడం అన్యాయం

- ఆలయ భూములను పరిశీలించిన సీపీఐ నాయకులు

కొలిమిగుండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో వేలం ద్వారా రైతులకు కౌలుకు ఇవ్వాల్సిన దేవదాయ శాఖ భూములను సిమెంట్ పరిశ్రమకు అప్పగించడం తీవ్ర అన్యాయమని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు సంఘం నాయకులు రామానాయుడు అన్నారు. శనివారం కొలిమిగుం డ్ల మండలంలోని కల్వటాల పరిధిలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు అప్పగించారంటున్న ఆలయ భూములను స్థానిక రైతులతో కలిసి, సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా సీపీఐ నాయకులు రంగనాయుడు, రామానాయుడు మాట్లాడుతూ ఆలయ భూములు కౌలుకు వేసుకుంటున్న రైతులతో పాటు, పరిశ్రమ చుట్టూ ఉన్న రైతులను రామ్‌కో పరిశ్రమ మానసికంగా వేధించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. రైతులకు అండగా సీపీఐ ఉంటుందన్నారు. రైతులపై రామ్‌కో సిమెంట్ పరిశ్రమ దుందుడుకు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో దేవాదాయ శాఖ భూములను సిమెంట్ పరిశ్రమలాక్కోవడానికి ప్రయత్నం చేస్తోందని, ఆయా గ్రామల ప్రజలు కూడా దీన్ని అడ్డుకోవాలన్నారు. రైతులు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, పుల్లయ్య, జనసేన పెద్దయ్య, నారపురెడ్డి పాల్గొన్నారు.



ఆలయ భూములను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ ఆసుపత్రికి బెంచీలు విరాళం

డోన్ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు రూ.లక్ష విలువ చేసే బెంచీలను విరాళంగా అందజేశారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా బెంచీలను డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్యగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్, టీడీపీ నాయకులు ఆర్‌ఈ నాగరాజు, చంద్రపల్లె లక్ష్మీనారాయణ, కొత్తపల్లి కిరణ్, డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వినతులను ఎమ్మెల్యే కోట్ల స్వీకరించారు. పట్టణంలోని కేఈ కృష్ణమూర్తినగర్‌లో సిమెంటు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని మాధవస్వామి ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. పట్టణంలోని 32వ వార్డు పరిధిలోని శ్రీనివాస థియేటర్ ప్రధాన రోడ్డు నుంచి హైవే రోడ్డు వరకు సిమెంటు రోడ్డు, కాలువలు, వీధిలైట్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఆయా గ్రామాల నుంచి పలువురు భూసమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తామన్నారు. ఈ ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లక్ష్యసాగరం లక్ష్మి రెడ్డి, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, కమలాపురం గ్రామ సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రికి అందజేసిన బెంచీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

చాగలమర్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కస్తూర్బా, ప్రభుత్వ బాలికల పాఠశాలలో వినాయక ఫౌండేషన్ అధినేత గోపాలకృష్ణయ్య, ఆర్య స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో దాతలు నారాయణ, పవన్‌కుమార్‌ల సహకారంతో పది పరీక్షల కిట్లను ఆయా పాఠశాలలకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఎస్‌వో ఉసేన్‌బీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

రుద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భాస్కర నందీశ్వరాలయం ఆవరణంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ తలుపులు పగులగొట్టి హుండీలో ఉన్న డబ్బులు ఎత్తుకెళ్లినట్లు శనివారం నిర్వాహకులు ఏరువ క్రిష్ణమూర్తి తెలిపారు. అలాగే అవధూత కాశిరెడ్డినాయన దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో ఉన్న హుండీనే ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

దరఖాస్తుకు గడువు పొడిగింపు

డోన్ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపాన ఉన్న డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు తెలిపారు. శనివారం స్థానిక ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 6 నుంచి 13 వరకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో అధిక ఉష్ణోగ్రత నమోదు అయిందన్నారు. వృద్ధులు, శిశువులు, కూ లీలు, అధికంగా ఎండలో తిరిగే వ్యక్తులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని, జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. తేలికపాటి దుస్తులు ధరించాలని సూచించారు. వేడి వాతావరణంలో తీవ్ర కార్యకలాపాల్లో పాల్గొనకుండా తరచు విశ్రాంతి తీసుకొని ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం, రుద్రవరం సమీపంలోని దొర్వి, గుట్టకొండ లక్ష్మీనరసింహ ఆలయాలతో పాటు నరసాపురంలోని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వాసాపురం వేంకటేశ్వరస్వామికి లక్ష్మీదేవి గోదాదేవి అమ్మవారికి మానసలింగేశ్వరస్వామి త్రిపురసుందరీదేవి అమ్మవర్లాకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

సంజామల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సంజామలకు చెందిన బాలిక అదృశ్యమైన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య శనివారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలిక పరీక్షలు ముగించుకొని శుక్రవారం సొంతవూరుకు వచ్చి సాయంత్రం 4గంటల తర్వాత అదృశ్యమైందని అన్నారు. ఈ మేరకు బాలిక సోదరి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మురుగు ఇలా.. నడిచేదెలా?

కొలిమిగుండ్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపెంట గ్రామంలోని ఓసీ, ఎస్సీ కాలనీల్లో రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. దాంతో నడిచి వెళ్లేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు కారణంగా దోమల బెడద తీవ్రంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.



తుమ్మలపెంట ఓసీ కాలనీలో పారుతున్న మురుగు

గ్రామానికి తాగునీటి సరఫరా

ప్యాపిలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు ఔదార్యం చాటారు. ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీరు సరఫరా చేస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎన్ రాచెర్ల గ్రామంలో వారం రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. బోరులో నీరు పూర్తి గా అడుగంటిపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో స్పందించిన టీడీపీ గ్రామ నాయకులు క్రిష్టారెడ్డి ట్యాంకర్లతో తన పొలంలోని బోరు ద్వారా నీటి సరఫరా చేస్తూ ప్రజల దాహార్తి తీరుస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారయ్యే వరకు సరఫరా చేస్తామని క్రిష్టారెడ్డి తెలిపారు. గ్రామస్థులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.



రాచెర్ల గ్రామంలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న కృష్ణారెడ్డి